## క్లుప్తంగా

### కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే నయం



మాట్లాడుతున్న డాక్టర్ మమతారాణి

పలమనేరు: కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే నయం చేసేఅవకాశం ఉంటుందని స్థానిక ఏరియా ఆస్పత్రి చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ మమతారాణి అన్నారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీ డాక్టర్లకు స్థానిక ఆస్పత్రిలో సోమవారం క్యాన్సర్ స్క్రీనింగ్‌పై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఒకప్పుడు కేన్సర్ అంటే మరణం తప్పదనే భయం ఉండేదని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. కేన్సర్‌కు పలు అత్యాధునిక వైద్య చికిత్స విధానాలు అందుబాటులో వచ్చాయని చెప్పారు. దీంతో ఏ కేన్సర్ అయినప్పటికీ ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్సతో దాని నుంచి విముక్తి పొందవచ్చన్నారు. అనంతరం వివిధ రకాల కేన్సర్లు, వాటికి చికిత్సా విధానాల గురించి ఎస్వీ కళాశాల అధ్యాపకులు, పలువురు వైద్య నిపుణులు ప్రసంగించారు.

### టెన్త్ ప్రతిభావంతులకు సన్మానం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను సన్మానిస్తున్న దృశ్యం

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మొన్నటి పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను స్థానిక సమాజసేవకుల సంఘం సోమవారం ఘనంగా సన్మానించింది. పాఠశాలకు చెందిన అమూల్య, భానుశ్రీ, తబ్సుమ్‌లకు శాలువాలు కప్పి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలున్నాయని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యోగాగురువు నందగోపాల్, మోహన్, లైబ్రేరియన్ హేమంత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గిరీషా

సదుం: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండటమే కాకుండా ఆ దిశగా చర్యలు కూడా తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందికి మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ రాజశేఖర్ బాబు, సీహెచ్‌సీ మెడికలాఫీసర్ డాక్టరు గిరీషా మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో డెంగీ, మలేరియా, డయేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాలలో పారిశుధ్యం సమస్యలు ఉత్పన్నం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. నివాస గృహాల మధ్య నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు నారాయణస్వామి, ఈఓఆర్డీ వరప్రసాద్, ఆరోగ్య సిబ్బంది ఉదయభాస్కర్, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

### పట్టణ సమస్యలు పరిష్కరించరూ!

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కమిషనర్ నరసింహప్రసాద్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని, మంచినీటి సమస్యను పరిష్కరించాని, గోవధ నిషేధం అమలు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అయూబ్‌ఖాన్, రాజారెడ్డి, నరసింహులు తదితరులు ఉన్నారు.

### రొంపిచెర్ల యువతికి డాక్టరేట్



జ్యోతి

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని బలిజవీధికి చెందిన నాగిశెట్టి జ్యోతికి తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. తమిళనాడు రాష్ట్రం వెల్లూరు విట్‌లో కళాశాలలో ప్రొఫెసర్ విజయకుమార్ పర్యవేక్షణలో ఆమె 'ఫ్లూయిడ్ డైనమిక్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధన పత్రానికి సోమవారం ఉదయం ఎస్వీ యూనివర్సిటీలో ప్రొఫెసర్ వి.సుగుణమ్మ చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ అందుకున్నారు.

# తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం

**నీరు తక్కువగా ఉన్న రైతులకు దోస సాగు ఉపయుక్తం**

- పంట కాలం కేవలం రెండు నెలలే!
- స్థానికంగానే మార్కెట్ సౌకర్యం
- ఏడాది పొడవునా సాగుకు అనుకూలం



లక్ష్మీప్రసన్న, హార్టికల్చర్ ఆఫీసర్



బైరెడ్డిపల్లె మండలంలో సాగవుతున్న దోస పంట



పలమనేరు: నీటి సౌకర్యం తక్కువగా ఉన్న రైతన్నలకు దోస సాగు లాభదాయకంగా మారింది. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో తక్కువ సమయంలో సాగయ్యే ఈ పంట కల్పతరువులా మారింది. స్థానిక మార్కెట్‌లోనే విక్రయించుకోవడంతో పాటు కూలీల సమస్య తక్కువగా ఉంటుండడంతో ప్రస్తుత తరుణంలో దోస సాగు ఎంతో ఉత్తమమని ఉద్యానశాఖ అధికారిణి లక్ష్మీప్రసన్న చెప్పారు.

**మూడు నియోజకవర్గాల్లో సాగు**

తీగ రకానికి చెందిన దోస గుమ్మడి, అనపలను పోలి ఉంటుంది. ఇందులో తక్కువ కేలరీలు, ఎక్కువగా విటమిన్ ఏ, సి ఉంటుంది. దాహాన్ని తీర్చగలిగే గుణం ఉన్న పండు ఇది. ఇవి చిత్తూరు జిల్లా ఉష్ణోగ్రతపరంగా సాగుకు చాలా అనుకూలంగా ఉంటాయి. ప్రస్తుతం జిల్లాలోని పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో సాగు అవుతోంది. ఇసుకవాటం, ఎర్రటి, ఒండ్రు నేలల్లో సాగు చేస్తున్నారు. ముఖ్యంగా ఉదజని సూచిక 6.0-6.7 ఉన్న నేలలు పంటకు అనుకూలం. ఏడాది పొడవునా పంటను సాగు చేసుకోవచ్చు. ప్రస్తుతం హైబ్రిడ్ రకాలైన మాలిని, ఎన్‌కౌంటర్ విత్తనాలను స్థానిక రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరాకు 350 గ్రాముల విత్తనాలు సరిపోతాయి.

**సాగువిధానం**

- ఎకరాకు 5 టన్నుల పశువుల ఎరువును వేయాలి.
- 40 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్, 40 కిలోల నత్రజనినిచ్చే ఎరువులను వాడాలి.
- నత్రజనిని మాత్రం నాటేటపుడు, నాటిన 25 రోజులకు వేసుకోవాలి.
- పొలం సిద్ధం చేసుకున్నాక రెండున్నర మీటర్ల ఎడంతో 60 సెంటీమీటర్ల వెడల్పుతో నీటి కాలువలను ఏర్పాటు చేసుకోవాలి.
- కాలువకు ఇరువైపులా 30 నుంచి 50 సెంటీమీటర్ల ఎడంతో విత్తనాలను విత్తుకోవాలి.
- పంట ప్రథమ దశలో, మళ్లీ కాయ దిగేటప్పుడు మాత్రం నీటిని ఎక్కువగా, మిగిలిన కాలంలో తక్కువగా ఇవ్వాలి.
- పందిరి కూరగాయల సాగుకు పాటించే సస్యరక్షణ చర్యలను అనుసరిస్తే సరిపోతుంది.
- కలుపు నివారణకు మెటలాక్లోర్‌ను వాడుకోవాలి.
- పంటలో ఆడపూలు ఎక్కువగా వస్తాయి కాబట్టి పిందె బాగా నిలవడానికి మూడు ఆకుల దశలో బోరాక్స్‌ను లీటరు నీటికి రెండు గ్రాములు చొప్పున పిచికారీ చేసుకోవాలి.
- పూత రావడానికి ముందు తీగ చివర్లను తుంచడంతో పక్కతీగలు అబివృద్ధి చెంది దిగుబడి పెరుగుతుంది.
- మంచి పంట యాజమాన్య పద్ధతులను పాటిస్తే ఎకరాకు 4–5 టన్నుల దాకా దిగుబడి పొందవచ్చు.

### బ్యాగులు, షూస్ పంపిణీ



పుంగనూరులో పాఠశాలలకు తరలిస్తున్న బ్యాగులు, షూస్

పుంగనూరు: మండలంలోని 130 స్కూళ్లలోని విద్యార్థులకు బ్యాగులు, షూస్‌లను పంపిణీ చేసినట్లు ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి తెలిపారు. సోమవారం 90 పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు వీటిని అందజేసినట్టు చెప్పారు. మిగిలిన పాఠశాలలకు రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని, వీటిని ఉపాధ్యాయులు ఆయా స్కూళ్ల విద్యార్థులకు జాప్యం చేయకుండా ఇవ్వాలన్నారు.

### పాము కాటేసింది

పుంగనూరు: పట్టణంలోని చెంగలాపురంలో నివాసం ఉన్న ప్రసాద్ (42) పొలం పనులు చేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితుడిని మదనపల్లె ఆసుపత్రికి తరలించారు.

### తెలుగులో ప్రమాణం హర్షణీయం

గంగవరం: రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, లోక్‌సభ సభ్యులు తెలుగులో ప్రమాణ స్వీకారం చేయడం హర్షణీయమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే స్ఫూర్తితో సభ్యులందరూ విద్యాహక్కు చట్టం, జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం పాఠశాల స్థాయిలో మాతృభాష మాధ్యమంలోనే అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యాబోధన చేసేలా కృషి చేయాలని కోరారు.

### జేసీబీ ఢీకొని మోటార్ సైక్లిస్టుకు గాయాలు



గాయపడిన వెంకటప్ప

చౌడేపల్లె: జేసీబీ ఢీకొనడంతో మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చౌడేపల్లె- పలమనేరు మార్గంలో చోటుచేసుకుంది. వివరాలు.. పలమనేరు మండలం జల్లిపేటకు చెందిన వెంకటప్ప(50) సొంతపనులపై బైక్‌లో చౌడేపల్లెకు వస్తుండగా మార్గమార్గంలో చౌడేపల్లె వైపు నుంచి రాయలపేటకు వెళ్తున్న జేసీబీ దాదేపల్లె సమీపంలోని కేపీఎల్ క్రీడా మైదానం వద్ద ఎదురుగా వస్తున్న వెంకటప్పను ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటప్ప కాలి మోకాలి చిప్ప భాగంలో తీవ్ర గాయమైంది. ప్రథమచికిత్స అనంతరం అతడిని తిరుపతి రూయాకు తరలించారు.

## ఈహెచ్‌ఎస్ కార్డుల సమస్యలు పరిష్కరించరూ!

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి వినతి



వైద్య ఆరోగ్య శాఖామంత్రిని కలిసిన ఆపస్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగుల ఈహెచ్‌ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్) కార్డుల సమస్యలను పరిష్కరించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజి కోరారు. సోమవారం ఆ అసోసియేషన్ నాయకులు విజయవాడలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను నివేదించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు విలేకరులతో మాట్లాడారు. ఈహెచ్‌ఎస్ కార్డు సమస్యలను పరిష్కరించి ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కలిగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని ఆసుపత్రులలో ఈహెచ్‌ఎస్ వైద్య సదుపాయానికి అనుమతించడం లేదన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని సమాంతరంగా శాశ్వతంగా కొనసాగించాలన్నారు. మెడికల్ బిల్లులు అప్‌లోడ్ చేయడంలో ఉండే కాలపరిమితిని ఆరు నెలల నుంచి సంవత్సరానికి పెంచాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లో ప్రస్తుతం ఉన్న సీలింగ్ అమౌంట్ రెండు లక్షల నుంచి ఐదు లక్షలకు పెంచాలన్నారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లోని ప్రధాన ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ వైద్యసేవలు, చికిత్స కల్పించాలని, అలాగే 45 ఏళ్లు దాటిన ఉద్యోగులకు ప్రతి ఏటా మాస్టర్ హెల్త్ చెకప్ చేసుకునేలా అవకాశం కల్పించాలన్నారు. ఈహెచ్‌ఎస్ విధానంలో ఆసుపత్రిలో అడ్మిట్ అయిన 12 గంటల్లోపు ఆమోదం ఇవ్వాలని కోరారు. సమస్యలను సావధానంగా విన్న మంత్రి సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఆపస్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఇతర నాయకులు శ్రావణ్ కుమార్, సురేశ్‌కుమార్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేశారు. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోష నివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

## మళ్లీ మంచి రోజులొస్తాయి

చిత్తూరు కార్పొరేషన్: ''కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటాం..ఎవరూ అధైర్యపడొద్దు..ప్రజల మధ్యనే ఉందాం..సమస్యలపై ప్రజల పక్షాన పోరాడుదాం..మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయి..'' అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పార్టీ శ్రేణులకు ధైర్యవచనాలు పలికారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో గుడిపాల, రూరల్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో పార్టీ ఓటమిని తలచుకుంటూ కృంగిపోరాదన్నారు. కూటమి నేతలు పలు వాగ్దానాలను ఇచ్చి అధికారంలో వచ్చారని, అవి ఎంతవరకు నెరవేరుస్తారో చూడాలన్నారు. మూడు పార్టీలు జతకట్టినా తమ పార్టీ ఓటు బ్యాంకును రాష్ట్ర వ్యాప్తంగా 40 శాతానికి తగ్గించలేకపోయారన్నారు. ప్రధానంగా అందరి కష్టాలు, సాధక బాధలు తెలుసుకోవడానికి సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## అశ్వవాహనంపై శ్రీరాముడి విహారం



టి.పుత్తూరు కోదండరామాలయంలో నిర్వహిస్తున్న ఉయ్యాలసేవ



అశ్వవాహనంపై కొలువుదీరి భక్తులను కనువిందు చేసిన శ్రీరామచంద్రుడు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు శ్రీ కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అశ్వవాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఉభయదారులు సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి తిరుమంజనం, ఉభయకర్తలు సుబ్రమణ్యం రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. 11 గంటలకు ఉభయదారులు జయప్రకాష్ రెడ్డి స్వామికి ఉత్సవం చేయించారు.

**భక్తిప్రపత్తులతో ఉయ్యాలసేవ**

సోమవారం సాయంత్రం ఉభయదారులు అమరావతిరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి ఉయ్యాలసేవ ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు పూజసామగ్రి, ప్రసాదాలు, సుగంధ పుష్పాలను, పట్టువస్త్రాలను సమర్పించారు. సోమవారం రాత్రి ఉభయకర్తలు అశ్వవాహన సేవకు ఉభయదారులు కుప్పాలపల్లె గురుమూర్తి కుటుంబసభ్యులుపూజాసామగ్రి, తీర్థప్రసాదాలు, గజమాలలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. స్వామి వారు అశ్వంపై కొలువుదీరి ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. భక్తులు స్వామికి ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించారు.

**నేడు చక్రస్నానం, వసంతోత్సవం**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, మధ్యాహ్నం మోహినీ ఉత్సవం, సాయంత్రం ఉట్లోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం, ఏకాంత సేవ నిర్వహించనున్నట్టు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్ధేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకులు తెలిపారు.

## అతిసారం బారిన పడకుండా చూద్దాం



పుంగనూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంగమునిరెడ్డి

పుంగనూరు: ప్రజలు అతిసారం బారిన పడకుండా చూడాలని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి కోరారు. వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలో కొన్నిచోట్ల అతిసారం కేసులను గుర్తించిన నేపథ్యంలో పుంగనూరు అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంజితతో కలసి వివిధ శాఖల అధికారులకు అతిసారంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని మురుగు నీటి కాలువలు, వీధులు శుభ్రం చేయించి, బ్లీచింగ్, ఫినాయిల్ స్ప్రే చేయాలన్నారు. కుళ్లిన ఆహారపదార్థాలు, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తినరాదని సూచించారు. అలాగే నీటిని కాచి వడపోసి తాగాలని, ఇంటి వద్ద నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో ఎక్కడా పారిశుధ్యం సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇదే విషయమై ప్రజలకు సైతం అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజేశ్వరి పాల్గొన్నారు.

**డయేరియాపై విద్యార్థులకు అవగాహన**

చౌడేపల్లె: పరిశుభ్రమైన ఆహార పదార్థాలే తినాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని హెచ్ఎం గణేష్ అన్నారు. సోమవారం చారాల ప్రాథమిక పాఠశాలలో డయేరియాపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంఎల్‌హెచ్‌పి నీరజ మాట్లాడుతూ, డయేరియా బారిన పడితే వేడి ఆహారం మాత్రమే తీసుకోవాలన్నారు. ఎక్కువసార్లు విరోచనాలు, వాంతులు, తలనొప్పి నీరసం వంటి లక్షణాలుంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినరాదన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఉష, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**డయేరియా నియంత్రణపై సమీక్ష**

గంగవరం: మండల స్థాయిలో డయేరియా నియంత్రణపై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మంచినీటి సరఫరా, నీటి ట్యాంకుల క్లోరినేషన్, గ్రామ స్థాయిలో పారిశుధ్యం, వ్యక్తిగత పారిశుధ్యం గురించి చర్చించారు. ప్రతి గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఇలాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా అరికట్టేందుకు అవకాశం ఉంటుందని గంగవరం పీహెచ్‌సీ వైద్యులు లహరి తెలిపారు. పంచాయతీ రాజ్, వైద్య శాఖలు ఈ కార్యక్రమంలో భాగస్వాములై డయేరియా నియంత్రణకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో పత్తికొండ వైద్యులు సర్తాజ్, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఎంఈఓ-2 శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



చౌడేపల్లె: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



గంగవరం: డయేరియా నియంత్రణపై సమావేశంలో చర్చిస్తున్న మండల స్థాయి అధికారులు

### 29న ఆలయ అంగళ్ల గేటు వేలం

గుడుపల్లె: గుడివంక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు ఈ నెల 29న శనివారం ఆలయ ఆవరణలో అంగళ్లకు గేటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ చలపతి, అర్చకులు వీరశేఖరయ్య తెలిపారు. ఆలయ బ్రహ్మోత్సవాలు జూలై 24 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ బ్రహ్మోత్సవాలలో ఆలయ ఆవరణలో అంగళ్ల గేటు, లడ్డు ప్రసాదం విక్రయానికి అనుమతి, తలనీలాల సేకరణకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వేలం పూర్తయిన వెంటనే పాటదారుడు మొత్తం సొమ్ము చెల్లించాలన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

యాదమరి (పూతలపట్టు): డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యార్థులు సహకారం అందించాలని చిత్తూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. అలాంటి వారు కనబడితే వెంటనే 14500 నంబర్‌కు కాల్ చేయాలని, లేదా పోలీసులకు తెలియజేయాలని తెలిపారు.

### ప్రతిభావంతుడికి విట్‌లో ఉచిత విద్య



విద్యార్థికి బెస్ట్ అవార్డు ఇస్తున్న అధ్యాపకులు

గుడుపల్లె: ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ కనబరచిన ఇదయత్ బాషా అనే విద్యార్థికి విజయవాడలోని విట్ కాలేజీలో బీటెక్ ఉచిత అడ్మిషన్, వసతి సౌకర్యం కల్పించిందని కళాశాల ప్రిన్సిపల్ రామక్రిష్ణమనాయుడు తెలిపారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇదయత్ బాషాను అభినందించారు. ఇంటర్ ఎంపీసీ గ్రూపులో 1000 మార్కులకు 939 మార్కులు ఇదయత్ సాధించాడని, దీంతో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ సలహా మేరకు విట్‌లో బీటెక్ అడ్మిషన్ పొందాడన్నారు. వెనుక బడిన విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేసిన అధ్యాపకులనూ ఆయన అభినందించారు. అలాగే కళాశాల నుంచి ఇదయత్ బాషాకు బెస్ట్ స్టూడెంట్ అవార్డును అధ్యాపకులు అందజేశారు.